క్లుప్తంగా

'బెదిరించడం సరైంది కాదు'

నల్లగొండ టౌన్ : చెరుకు సుధాకర్‌ను చంపుతామని ఆయన కుమారుడు డాక్టర్ సుహాస్‌కు ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫోన్ చేసి బెదిరించడం సరైంది కాదని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ సామాజిక వర్గాలమీద ఇలాంటి వ్యాఖ్యలు చేసినట్లయితే బీసీల తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వడ్డెబోయిన సైదులు, బక్కతట్ల వెంకన్న యాదవ్, పగిళ్ల కృష్ణ, వల్ల కీర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'కోమటిరెడ్డి క్షమాపణ చెప్పాలి'

మర్రిగూడ : తెలంగాణ ఉద్యమకారుడు చెరుకు సుధాకర్‌పై భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని గౌడ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చెరుకు లింగంగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ చెరుకు సుధాకర్‌ను చంపుతామని వారి కుమారుడికి ఫోన్ చేసి బెదిరించడం హేయమైన చర్య అన్నారు. తక్షణమే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోని బహిరంగ క్షమాపణలు చెప్పాలన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

చండూరు : గ్రామాల్లో వేసే సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బంగారిగడ్డ గ్రామంలో వేస్తున్న సీసీ రోడ్డును ఆయన పరిశీలించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రతి వీధిలో సీసీ రోడ్లు వేయిస్తున్నామన్నారు. ఆయన వెంట సర్పంచ్ పల్లె వెంకటేశ్‌గౌడ్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి

నల్లగొండ టౌన్ : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, కుంభం కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక 43వ వార్డులో కట్టెల పొయ్యిపై వంటచేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కుంభం లక్ష్మమ్మ, కార్తీక్, నాయిని నర్సమ్మ, శ్యామల ప్రసన్న, జాన్‌రెడ్డి, శివమ్మ, విష్ణుమూర్తి, గోపాల్‌రెడ్డి, మణెమ్మ, పర్వతమ్మ, రాములు, బట్టు సత్తయ్య, నిర్మల, బీబమ్మ పాల్గొన్నారు.

కురుమ సంఘం భవనానికి భూమి పూజ



భూమి పూజ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ : మండలంలోని దామెరభీమనపల్లి గ్రామంలో కురుమ సంఘం నూతన భవనానికి మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్, మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, మాజీ జెడ్పీటీసీ మేతరి యాదయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, లెంకలపల్ల ఎంపీటీసీ ఏర్పుల శ్రీశైలం, నాయకులు మలిగిరెడ్డి గోపాల్‌రెడ్డి, యాస అమరేందర్‌రెడ్డి, పిట్టల శ్రీనివాస్, సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మెండు దీపికరెడ్డి, లింగారెడ్డి, వెంకటేష్‌గౌడ్, సిలివేరు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటార్‌కు మరమ్మతులు చేపట్టాలి

మర్రిగూడ : నెల రోజుల క్రితం గ్రామ పంచాయతీ బోరు మోటార్ పాడైపోవడంతో నీరు అందక మండలంలోని కుదభాక్షపల్లి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏఐఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి ఇస్కిల్ల మహేందర్ అన్నారు. ఆదివారం గ్రామంలో ఆయన మాట్లాడుతూ.. నెల క్రితం 5వ వార్డులోని కాలనీలో బోరు మోటార్ చెడిపోయిందని, దానికి ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో నీరు అందక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి బోరు మోటార్‌కు మరమ్మతులు చేపట్టి నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.



మరమ్మతులకు నోచుకోని బోరు మోటార్

మార్షల్ ఆర్ట్స్‌లో మేము సైతం..

- ప్రభుత్వ హైస్కూళ్లలో శిక్షణ
- ఆసక్తిగా నేర్చుకుంటున్న బాలికలు



చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

చిట్యాల : విద్యాశాఖ ఆధ్వర్యంలో ×రాణి లక్ష్మీబాయి ఆత్మ రక్షణ ప్రసిక్షణ్×కార్యక్రమంలో భాగంగా మార్షల్ ఆర్ట్స్‌లో బాలికలకు మండలంలోని పలు గ్రామాల జెడ్పీహెచ్‌ఎస్‌లలో నెల రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థినులు కూడా చురుగ్గా పాల్గొంటూ శిక్షణ తీసుకుంటున్నారు.

జెడ్పీహెచ్‌ఎస్‌లలో..

కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిట్యాల, పెద్దకాపర్తి, వనిపాకల, వట్టిమర్తి, నేరడ గ్రామాల్లోని జెడ్పీహెచ్‌ఎస్‌లలో 8, 9,10వ తరగతికి చెందిన విద్యార్థినులకు మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షకుల ద్వారా ప్రతిరోజు శిక్షణ ఇస్తున్నారు. ఈ ఏడాది జనవరి 27 తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. విద్యార్థినులకు కరాటే, కిక్ బాక్సింగ్, యోగా వంటి వాటిలో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థినుల్లో మానసిక, శారీరక మనోధైర్యాన్ని పెంపొందించేందుకు శిక్షణ నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లో నలభై రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. బాలికలపై శారీరకంగా జరిగే ఎలాంటి దాడినైనా మార్షల్ ఆర్ట్స్ ద్వారా ఎదుర్కొనేందుకు దీటుగా విద్యార్థినులను శిక్షకులు తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థినులు సైతం ఆసక్తితో మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటున్నారు.

ప్రతిరోజు శిక్షణ ఇవ్వాలి



మా పాఠశాలలో మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకుంటున్నాం. ఈ శిక్షణతో మాలో ఎంతోధైర్యం పెరిగింది. విద్యా సంవత్సరం మొత్తంగా ప్రతి రోజు మార్షల్ ఆర్ట్స్, యోగా శిక్షణ ఇచ్చి మాకు ధృవీకరణ పత్రాలు ఇస్తే బాగుంటుంది.

–పాల సంధ్య, చిట్యాల, జెడ్పీహెచ్‌ఎస్

విద్యార్థినులు చురుగ్గా నేర్చుకుంటున్నారు



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు కరాటే, కిక్ బాక్సింగ్ శిక్షణ ఇస్తున్నా. విద్యార్థినులు చురుగ్గా పాల్గొని మెళకువలు నేర్చుకుంటున్నారు. విద్యార్థినులు ధృడంగా తయారవడంతోపాటు, వారికి నిత్య జీవితంలో మార్షల్ ఆర్ట్స్ ఉపయోగకరంగా ఉంటుంది.

–చిరగోని శ్రీశైలం, మాస్టర్

విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుంది



పాఠశాలల్లో విద్యార్థినులకు ఇస్తున్న మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంది. మార్షల్ ఆర్ట్స్ శిక్షణతో విద్యార్థినుల్లో ఆత్మస్థైరం పెరుగుతుంది. విద్యార్థినులకు వారంలో మూడు రోజులపాటు మార్షల్ ఆర్ట్స్‌లో గంటన్నర శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థినులు సైతం ఉత్సాహంగా నేర్చుకుంటున్నారు.

–గోగికార్ మాధవి, హెచ్‌ఎం, చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్

గ్రామాల అభివృద్ధే సీఎం కేసీఆర్ ప్రధాన లక్ష్యం

- నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి : గ్రామాల అభివృద్ధే ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధాన లక్ష్యమని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. ఆదివారం మండలంలోని దాసరిగూడెం గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.20 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం పని చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండూరు శంకర్‌గౌడ్, సర్పంచ్ ఉప్పుల అనంతలక్ష్మిరాంరెడ్డి, ఉప సర్పంచ్ శంకర్, వెంకట్ రెడ్డి, రేగట్టె నారాయణరెడ్డి, శాపల్లి సర్పంచ్ కర్నాటి ఉపేందర్, యల్లారెడ్డిగూడెం సర్పంచ్ మేడి పుష్పలత శంకర్, దాసరి సైదులు తదితరులున్నారు.

లయన్స్ క్లబ్ సేవలు విస్తరించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సునిల్‌కుమార్

నల్లగొండ టౌన్ : జిల్లాలో లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని లయన్స్ క్లబ్ కాన్సిట్యూషనల్ ఏరియా లీడర్ డి.సునిల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానికంగా జరిగిన లయన్స్ క్లబ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. సభ్యత్వాలు పెంచి నూతన క్లబ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా గవర్నర్ తీగల మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జగిని భీమయ్య, బాబూరావు, ఎం. విద్యాసాగర్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, శివప్రసాద్, గోలి అమరేందర్ రెడ్డి, నేతి రఘుపతి, రామానుజాచార్యులు, డాక్టర్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుల వృత్తులకు పూర్వ వైభవం కేసీఆర్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ : తెలంగాణ తరహాలో దేశంలో కుల వృత్తులకు పూర్వ వైభవం రావాలంటే బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తోనే సాధ్యమని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆధునిక దోభీ ఘాట్ల నిర్మాణంపై జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి రజకుల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రజక, నాయీబ్రాహ్మణులకు నెలకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్‌తోపాటు రూ.282 కోట్లతో 141 మున్సిపాలిటీల్లో ఆధునిక దోభీఘాట్లు నిర్మించామని తెలిపారు. అనంతరం సీడీపీ నిధులు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న రజక సంఘం భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, రజక భవన నిర్మాణ కమిటీ అధ్యక్షుడు ఆమంచి అంజయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడు చిలుకరాజు చెన్నయ్య, కోశాధికారి దూదిగామ సత్తయ్య, కార్యవర్గసభ్యులు ఎలిజాల సత్తయ్య, పట్టు సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



నకిరేకల్ : మాట్లాడుతున్న చెరుకు లక్ష్మి

నకిరేకల్ : ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల బిల్లుకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బోడ సునీల్‌మాదిగ గత నెల 28న కోదాడలో చేపట్టిన సంగ్రామ పాద యాత్ర ఆదివారం నకిరేకల్‌కు చేరుకుంది. యాత్రకు వివిధ పార్టీలు, సంఘాల నాయకులు స్వాగతం పలికారు. యాత్రకు హంస ఫౌండేషన్ చైర్మన్ చెరుకు లక్ష్మి మద్దతు పలికి మాట్లాడుతూ 28 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడుతున్నా.. కేంద్రం స్పందించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాతాకుల అంజయ్య, బీసీ సంఘం నాయకులు అర్రూరి వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ నేతలు కందికంటి అంజయ్య, మామిడి కరుణాకర్, ఇరిగి శ్రీశైలం, గ్యార శ్రీనివాస్, వడ్డె రంజిత్, బొజ్జ వేణుగోపాల్, బందెల సైదులు, గుండ్లపల్లి నాగరాజు, వంటల వెంకటేశ్వర్లు, పందుల వెంకట్, పందిరి రమేష్, నిరంజన్, నర్సింహ, అనిల్, మల్ల య్య తదితరులు పాల్గొన్నారు.

మూల్యం చెల్లించుకోక తప్పదు

కేతేపల్లి : ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించకపోతే ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఎమ్మార్పీస్ జిల్లా నాయకుడు బోడ సునీల్‌మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన మహా సంగ్రామ యాత్ర ఆదివారం కేతేపల్లి మండలానికి చేరుకుంది. చీకటిగూడెం, కొర్లపహాడ్, ఇనుపాముల గ్రామాల్లో స్థానిక నాయకులు యాత్రకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చిన బీజేపీ.. తొమ్మిదేళ్లుగా వర్గీకరణ అమలు చేయకుండా మాదిగలను మోసం చేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మామిడి కర్ణాకర్, ఇరిగి శ్రీశైలం, కత్తుల సన్నీ, తరికొండల్, మేడి కృష్ణ, పందిరి రమేష్, వంటిపాక కళ్యాణ్, వడ్డె కిశోర్ పాల్గొన్నారు.

ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమి

- ఆక్రమణలకు అడ్డాగా మారిన భైరవునిబండ
- సర్పంచ్ ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



క్రీడా ప్రాంగణాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న ఆక్రమణదారులు

శాలిగౌరారం : అటు ఆక్రమణదారుల ఇష్టారాజ్యం.. మరోపక్క అధికార యంత్రాంగం నిర్లక్ష్యం.. వెరసి ప్రభుత్వ పాఠశాల క్రీడా ప్రాంగణాన్ని కనుమరుగు చేస్తున్నాయి. 'ఆక్రమణలకు కాదేది అనర్హం 'అన్నట్లుగా ఉంది మండలంలోని భైరవునిబండ గ్రామంలో పరిస్థితి. ఇప్పటికే గ్రామంలోని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాల స్థలాన్ని కొందరు ఆక్రమించారు. ఇప్పుడు పాఠశాల క్రీడా ప్రాంగణానికి గ్రామకంఠంలో కేటాయించిన ఎకరం స్థలాన్ని కూడా ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు.

మూడు సర్వే నంబర్లలో 9.20 ఎకరాల ప్రభుత్వ భూమి

మండలంలోని భైరవునిబండ గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం రెండున్నర దశాబ్దాల క్రితం ప్రభుత్వం గ్రామస్తుల దగ్గర నుంచి సర్వే నంబర్ 297, 298, 299లలో 9.20 ఎకరాల వ్యవసాయ పట్టా భూమిని కొనుగోలు చేసింది. ఆ తర్వాత ఇళ్ల స్థలాల పంపిణీ కూడా చేపట్టింది. ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల్లో ఒక్క లబ్ధిదారుడు కూడా ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా వదిలివేశారు. దీంతో 2018లో రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాల పట్టాలను రద్దుచేసి స్థలాలను స్వాధీనం చేసుకుంది.

ప్రభుత్వ పనులకు స్థలం కేటాయింపు

భైరవునిబండ గ్రామంలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 9.20 ఎకరాల భూమిని ప్రభుత్వ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు కేటాయించారు. అందులో రెండున్నర ఎకరాల్లో 30 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టింది. నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. మరో రెండున్నర ఎకరాల్లో బ్లాక్ ప్లాంటేషన్, నర్సరీలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా మరో ఎకరం భూమిని ప్రభుత్వ పాఠశాల క్రీడా ప్రాంగణానికి కేటాయించారు. క్రీడా ప్రాంగణాన్ని 2 జూన్ 2022న అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.

ప్రభుత్వ భూమితోపాటు ఆట స్థలం ఆక్రమణ

భైరవునిబండ గ్రామంలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 9.20 ఎకరాల భూమిలో ప్రభుత్వం అభివృద్ధి, ప్రజాసంక్షేమ పథకాల కోసం 6 ఎకరాలు కేటాయించగా.. మరో 3.20 ఎకరాలు మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ఆక్రమణదారుల కన్ను మిగిలి ఉన్న ప్రభుత్వ భూమిపై పడింది. కొంతమంది నాయకులు ఆక్రమణదారులను పరోక్షంగా ప్రోత్సహించడంతో వారు ప్రభుత్వ భూమిని ఆక్రమించడం మొదలుపెట్టారు. దీంతో మిగిలి ఉన్న 3.20 ఎకరాల భూమితోపాటూ ప్రభుత్వ పాఠశాల క్రీడా ప్రాంగణానికి కేటాయించిన ఎకరం భూమిని కూడా ఆక్రమించి యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఆక్రమణదారులపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని రక్షించి గ్రామానికి మేలు చేయాలని పలువురు కోరుతున్నారు.

అధికారులకు ఫిర్యాదు చేశాం



గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు క్రీడాప్రాంగణం కోసం ప్రభుత్వం కేటాయించిన ఎకరం భూమిని గ్రామానికి చెందిన కొంతమంది ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో పాఠశాలకు ఆటస్థలం లేకుండా పోయింది. ఈ విషయంపై మండల అధికారులతోపాటూ జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం.

– దండ రేణుక, సర్పంచ్, భైరవునిబండ

నిర్మాణాలు తొలగిస్తాం



భైరవునిబండ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల క్రీడా ప్రాంగణానికి కేటాయించిన ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఆ భూమిని ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం కేటాయించాం. ఆక్రమిత స్థలంలో ఎలాంటి నిర్మాణాలు ఉన్నా తొలగిస్తాం.

– శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్, శాలిగౌరారం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నల్లగొండలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



శాలిగౌరారం : మాధారంకలాన్ గ్రామంలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నల్లగొండ టౌన్ : నల్లగొండలోని రావుస్ హైస్కూల్‌లో 1992–93 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు ఆదివారం స్థానికంగా ఓ హోటల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వర్‌రావు, ఉపాధ్యాయులు గౌసుద్దీన్, వెంకట్రామిరెడ్డి, వెంకటేశ్వర్లు నిర్వహణ కమిటీ ఆర్గనైజర్ రమేష్, సభ్యులు వెంకటరమణ, లక్ష్మీనారాయణ, లింగయ్య, ధనలక్ష్మి, పద్మ, నిర్మల, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

మాధారంకలాన్ పాఠశాలలో..

శాలిగౌరారం : మండలంలోని మాధారంకలాన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2003–04 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు ఆదివారం గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 సంవత్సరాల అనంతరం ఒకే వేదికమీద కలుసుకోవడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా నాడు విద్యాబోధన చేసిన ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రెడ్డి, ఉపాధ్యాయులు లింగారెడ్డి, ప్రర్వీన్యాచారి, రంగారెడ్డి, నర్సిరెడ్డి, యాదగిరి, షమీనా అక్తర్, భాస్కర్‌రెడ్డి, వీరయ్యలను పూలమాలలు, శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎండీ జహంగీర్, మెట్టు ఉపేందర్, సుల్తాన్, వెంకన్న, బందెల ఉదయ్, మామిడాల రవి, గద్దగూటి నరేశ్, వాణి, జ్యోతిలతో పాటూ మరో 35 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

చిట్యాల : మండలంలోని గుండ్రాంపల్లి గ్రామ యువజన కాంగ్రెస్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జరిగిన ఆ సంఘం సమావేశంలో ఎన్నుకున్నట్లు గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నమ్ముల విజయ్‌కుమార్ తెలిపారు. గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా దొంతరబోయిన శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా గోర్నాల వంశీ, సహాయ కార్యదర్శిగా బండ నవీన్‌కుమార్, కోశాధికారిగా ఎండీ. సోహెల్, సలహాదారులుగా అన్నెబోయిన దిలీప్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా జవాజీ మహేష్, జోగు నరేష్‌తోపాటు ఆరుగురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి రథోత్సవం

నాంపల్లి : మండలంలోని గౌరారంలో చలిదోన లక్ష్మీనర్సింహస్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిలుకూరి దశరథ, జెడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి, రైతు బంధు కన్వీనర్ ఏడుదొడ్ల రవీందర్‌రెడ్డి, సర్పంచ్ కొమ్మె యాదమ్మభిక్షం, దండిగ అలివేలునర్సింహ, నరేష్, చిలుకూరి భిక్షం, కృష్ణారెడ్డి, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు చరిత్రకు నిలయాలు

మిర్యాలగూడ : ఆలయాలు చరిత్రకు నిలయాలని, జాతరలు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలు అని జెడ్పీటీసీ ఐరుగు మంగమ్మ అన్నారు. ఆదివారం వేములపల్లి మండలంలోని ఆమనగల్లు గ్రామంలో వెలసిన శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామి జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన కబడ్డీ, కోలాట పోటీలను సీఐ సత్యనారాయణతో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్ వల్లంపట్ల ఝాన్సీ, వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, ఎంపీటీసీ మేకల లలిత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్ మేకల వెంకన్న, ఎస్ఐ కృపాకర్‌రావు, దేవరాజు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

మాకు ప్రాణ హాని ఉంది.. రక్షణ కల్పించండి

- పోలీస్ అధికారులను వేడుకుంటున్న బాధితులు



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

మిర్యాలగూడ టౌన్ తమకు ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించాలంటూ ఆదివారం సరికొండ కృష్ణవేణి తన కుటుంబ సభ్యులతో కలిసి తన స్థలం వద్ద ప్ల కార్డుల ద్వారా పోలీసు అధికారులను వేడుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని రవీందర్‌నగర్ కాలనీలో సర్వే నంబరు 211లో మాకు 7 కుంటల స్థలం ఉందని, ఆ స్థలంలో మున్సిపల్ అనుమతులతో రెండు గదుల ఇంటిని నిర్మించుకోగా గత నెల 27న సుమారు 60 మంది వరకు వచ్చి తాము నిర్మించుకున్న రెండు గదుల ఇంటిని, ప్రహారి గోడ, గేటు తదితర వాటిని పూర్తిగా ధ్వంస చేశారని, ఈ విషయంపై మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తిరిగి మరుసటి రోజుల మరో 30మంది వచ్చి మిగిలిన ఇంటిని పూర్తిగా ధ్వంసం చేయడంతో పాటు చంపుతామని బెదిరిస్తున్నారని, గతంలో ఇదే విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పట్లో కొంత మందిపై కేసులు కూడా నమోదు చేశారని తెలిపారు. ఈ భూమిపై కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ కూడా ఉన్నప్పటికీ ఆక్రమంగా తమ భూమిలోకి ప్రవేశించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని, నిర్మాణాలు కూల్చివేయడంతో సుమారు 5లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని, ఆక్రమంగా ఇళ్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయకుంటే ఇదే స్థలం వద్ద కుటుంబ సభ్యులందరం కలిసి ఆమరణ నిరహార దీక్ష చేపడతామని పేర్కొన్నారు. ఈప్లకార్డులను ప్రదర్శించిన వారిలో సరికొండ రామకృష్ణంరాజు, ప్రీతం రాజు, వేణువర్ధన్‌రాజు, గీత, ఆమూల్య తదితరులున్నారు.

మెడికో ప్రీతిది ముమ్మాటికీ హత్యే



ప్రీతి ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

మిర్యాలగూడ టౌన్ : వరంగల్ జిల్లాలోని కేఎంసీ మెడికల్ కళాశాలలో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్న ధరావత్ ప్రీతినాయక్‌ది ముమ్మాటికీ హత్యేనని పలు కుల సంఘాల నాయకులు ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో ప్రీతి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుల సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రీతి మృతి చెంది 10రోజులు అవుతున్నప్పటికీ నేటి వరకు కూడా నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నిందితుడు సైఫ్‌ను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో బంజార ఉద్యోగులు సంఘం జిల్లా అధ్యక్షులు మాలోతు దశరథనాయక్, యాదవ సంఘం నాయకులు మురళి యాదవ్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నీలకంఠం నాయక్, కుమ్మరి సంఘం నాయకులు వెంకటయ్య, రవినాయక్, వినోద్ నాయక్, మంజునాయక్, సుభాషిరెడ్డి, భిక్షం గౌడ్, బంటు కిషన్, కార్తీక్, సైదానాయక్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

దేవరకొండ : మండలంలోని మానావత్‌తండాకు చెందిన పలువురు ఆదివారం దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పార్టీ కార్యకర్తకు అండగా ఉంటామని హామీనిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముత్యాల సర్వయ్య, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, ఏర్పుల గోవిందుయాదవ్, మోహనకృష్ణ, కుమార్, శోభన్, మహేశ్, రమేశ్ పాల్గొన్నారు.